# తెలం'గానం' ఎంత మధురమో..!

## పెన్‌కౌంటర్

అన్ని దారులు రోమన్ వైపే అన్నట్లూ...తెలంగాణలో జరుగుతున్న ఉపఎన్నికల్లో అన్ని పార్టీలు తెలంగాణ మంత్రాన్నే జపిస్తున్నాయి. దీంతో మొదటి నుంచి ప్రత్యేక తెలంగాణ వాదం తమ సొత్తే అన్నట్లు వ్యవహరిస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి అయోమయంలో పడింది. ఉపఎన్నికల ప్రచారం మొదలు కాగానే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కూడా 'జై తెలంగాణ' అంటూ భజన చేయడం మొదలుపెట్టాయి. ఎన్నికల ప్రచారం మొదలు కాగానే రెండు ప్రధాన పార్టీలు (కాంగ్రెస్, టిడిపీ) తమ పంథాను మార్చుకుని తెలంగాణ సెంటిమెంట్‌కు 'సై' అంటూ జనం ముందుకు వెళుతున్నాయి. సవతి తల్లి ప్రేమను కురిపిస్తున్న రెండు పార్టీల వైఖరి ఓసారి పరిశీలిస్తే తెలంగాణపై వారికున్న ఇష్టత అవగతమవుతోంది.



ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అనాడు (అంటే ఉపఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందన్నమాట) ఏమన్నారో ఇప్పుడు చూద్దాం...

*'తెలంగాణ ప్రాంతంలో ఎక్కడా లేని అభివృద్ధి జరుగుతోందీ... కేసీఆర్ అంటున్న సెంటిమెంట్ ప్రభావం అంతగా లేదు, అభివృద్ధే మా మంత్రం. చిన్నరాష్ట్రాల కన్నా కలసిఉంటేనే అభివృద్ధి సాధ్యం. పైగా చిన్నాచితకా రాష్ట్రాలకు నక్సలైట్ల సమస్యలు పట్టిపీడిస్తాయి.....'*

*- వైఎస్ (మార్చి 2007)*

ఇలా అన్న ముఖ్యమంత్రి ఇప్పుడు మరి ఏమంటున్నారో కూడా తెలుసుకోవాలి. అభివృద్ధి మంత్రంతోనే తెలంగాణ ఉపఎన్నికల్లో గట్టెక్కుతామని మూడు నెలల కిందట చెప్పిన వైఎస్ ఇప్పుడు ఉపఎన్నికల ప్రచారంలోకి పాల్గొంటూ సెంటిమెంట్ కోట అయిన తెలంగాణలోకి దిగి ఇలా అంటున్నారు....

*'తెలంగాణ వాదన టీఆర్ఎస్ సొత్తు కాదూ, అసలు తెలంగాణ వాదాన్ని టీఆర్ఎస్ కంటే ముందుగా మేమే తీసుకువచ్చాం. తెలంగాణ సెంటిమెంట్ లేదని మేము ఏనాడూ అనలేదు...అలాంటప్పుడు సెంటిమెంట్ ఉన్నదీ...దాన్ని చూపిస్తామంటూ ఈ టీఆర్ఎస్ వాళ్లు మూకమ్మడి రాజీనామాలు చేశారూ... ప్రజల విశ్వాసం చోరగొన్న కాంగ్రెస్‌తోనే తెలంగాణ సాధ్యమవుతోంది... ఏ ఒక్క ప్రభుత్వం గతంలో చేయని అభివృద్ధి పనులు కూడా చేస్తున్నామూ... సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నాం..'*

*- వైఎస్ (మెదక్ జిల్లా రామాయంపేటలో మే 15 ప్రచార సభలో)*

ఉపఎన్నికల ఓటర్లారా...మన ఘనమైన ముఖ్యమంత్రి వైఎస్‌గారి ద్విముఖ ధోరణి చూశారుగా. ఇక మరి ప్రతిపక్షనేత, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శైలి ఎలా మారిందో చూడండి...

*'ప్రత్యేక తెలంగాణపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటాం...మా పార్టీ సమైక్యాంధ్రకే కట్టుబడి ఉంది.చిన్న రాష్ట్రాలతో అభివృద్ధి శూన్యం...*

*-చంద్రబాబు (మే 2008)*



గమనించాల్సిన విషయం: ఆనాడు టిడిపిలో కొంతమంది నాయకులు తెలంగాణ అంశంపై మాట్లాడినా దాన్ని తన వాక్చాతుర్యంతో త్రోసిపుచ్చడం

అప్పట్లో అలా వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మరి ఏమంటున్నారో కూడా తెలుసుకోవాలి. తెలంగాణ వ్యతిరేకించకుండానే ఉపఎన్నికల్లో గట్టెక్కుతామని గట్టిగా విశ్వసిస్తున్నారు. అనాడు చెప్పిన మాటలకు పూర్తి విరుద్దంగా తెలంగాణ ప్రాంతంలో పర్యటించి ఇలా అంటున్నారు....

*'తెలంగాణ సెంటిమెంట్ ఏ విధంగా ఉందో తెల్సుకునేందుకు ఓ కమిటి వేశాం...ఆ విధంగా ముందుకుపోతాం... మేము తెలంగాణకు వ్యతిరేకం కాదు. కమిటీ తీర్పు వచ్చాక స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తాం...ప్రత్యేక తెలంగాణ ఇస్తే మాకేమీ అభ్యంతరం లేదు...తెలంగాణలో తమ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగింది. తెలంగాణ ప్రాంతంలో టీడీపీకి ఆదరణ పెరిగింది. ప్రజలు టీడీపీకి అధికారం కట్టబెడుతారు...టీఆర్ఎస్ నాయకులు రాజీనామాలు ఎందుకు చేశారూ....దానివల్ల తెలంగాణ వస్తుందా అని సూటిగా కేసీఆర్‌ను అడుగుతున్నాను....'*

*-చంద్రబాబు (హుజురాబాద్‌లో మే 2008)*

ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రాంతంలో పర్యటించిన చంద్రబాబు సమైక్యాంధ్ర ఊసెత్తకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడం విశేషం.ఇక బిజెపి, సిపిఐ, లోక్‌సత్తా పార్టీలు కూడా ప్రత్యేక తెలంగాణ వాదంతో ప్రజల ముందుకు వెళుతున్నాయి. సిపిఐ పార్టీ

*'తాము ప్రత్యేక తెలంగాణకు సిద్ధం...*
*అందుకు కాంగ్రెస్ పార్టీనే అడ్డుపడుతుంది...'*

*–సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ (మార్చి 2008)*

ఇక భారతీయ జనతా పార్టీ మాత్రం తెలంగాణ రాష్ట్రం తమ వల్లే సాధ్యమని, టీఆర్ఎస్ వల్ల సాధ్యం కాదని తేల్చేసింది.



*'ప్రాంతీయ పార్టీల వల్ల తెలంగాణ సాధ్యం కాదు...*
*తెలంగాణ కోసం తమతో కలిసి వస్తే మంచిది...*
*జాతీయ స్థాయిలో ఉన్న బిజెపి వల్లే సాధ్యం.*
*అదీ మావల్లే అవుతుంది...'*

*దత్తాత్రేయ (బిజెపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు)*

ఇక ఇటీవలే పురుడు పోసుకున్న లోక్‌సత్తా పార్టీ కూడా తెలంగాణకు పచ్చజెండా ఊపినట్టే కనబడుతోంది. అయితే ఆ పార్టీ జాతీయ కన్వీనర్ జయప్రకాష్ నారయణ్ మాత్రం ఆచితూచి మాట్లాడుతున్నారు. ఆయన ఏమంటున్నారంటే...

*'విస్తీర్ణంలోనూ, జనాభాలోనూ పెద్దదే కాకుండా, రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక రాష్ట్రం ఇవ్వొచ్చు...అయితే రాజ్యవ్యవస్థ మారకుండా, రాజధాని మారితే అభివృద్ధి జరగదు...'*

*జయప్రకాశ్ నారాయణ్ (హైదరాబాద్‌లో మే 16 2008)*

ఇలా వివిధ పార్టీల నాయకులు తమ పంథా మార్చుకుని జై తెలంగాణ అంటూ, తెలంగాణ నినాదాలతో ప్రజల ముందుకు వెళుతుండడంతో టీఆర్ఎస్ పార్టీ దిక్కుతోచని స్థితిలో పడింది. ఇన్నాళ్ళూ తెలంగాణ వాదం తమ సొత్తు అన్నట్లు భావించిన ఆ పార్టీకి ఇప్పుడు అన్ని పార్టీలు అదే వాదం భుజానేసుకోవడంతో మింగుడుపడడంలేదు. సెంటిమెంట్ ప్రభావం నిరూపించేందుకు రాజీనామాస్త్రాలను ప్రయోగించిన టీఆర్ఎస్ ఇప్పుడు ఆత్మరక్షణ ధోరణిలో పడింది. మెజారిటీ స్థానాలను గెలుచుకోకపోతే సెంటిమెంట్ ప్రభావం తీవ్రంగా దెబ్బతింటుందని, తద్వారా ప్రజల్లో విశ్వాసం కోల్పోతామని టీఆర్ఎస్ నాయకుల్లో, కార్యకర్తల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇక ఓటరు మహాశయుని ఫలితం కోసం వేచిచూడాల్సిందే.

ఎన్.తుర్లపాటి/శేఖర్

# బాలకృష్ణకు మహారాజ యోగం

## జూన్‌లో రాజకీయ రంగప్రవేశం?

జూన్‌లో బాలయ్య రాజకీయరంగ ప్రవేశం....?

ఉపఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారుతుందనే వాదనను దాదాపు అన్ని పార్టీలు అంగీకరిస్తున్నాయి. ఫలితాలు ఎలా ఉన్నా అన్ని పార్టీలూ ప్రభావితం కాక తప్పని పరిస్థితి ఇప్పుడు ఉంది. మరో తొమ్మిది నెలలలో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావలసి రావడంతో ప్రస్తుత



ఎన్నికలను ఒక లిట్మస్ టెస్ట్‌లా అన్ని రాజకీయ పార్టీలూ తీసుకుంటున్నాయి. ఈ ఫలితాల ఆధారంగా వ్యూహాలు మార్చుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ అనుకూలవర్గాలు చెబుతున్న సర్వేల ప్రకారం ప్ర జలలో తెలంగాణా సెంటిమెంట్ అనుకున్నంత బలంగా ఏమీ లేదని తెలుస్తోంది. టిఆర్ఎస్ కొన్ని స్థానాలను కోల్పోక తప్పదని ఆ సర్వేలు చెబుతున్నాయి. మరి దీనిలో వాస్తవికత ఎంత అనేది మాత్రం ఎవరూ చెప్పలేకపోతున్నారు.

ఒకవేళ ఇదే నిజమైతే తెలుగుదేశం పార్టీకి చిక్కులు చాలా వరకూ తొలగినట్టే. చిరంజీవి నెలకొల్పే పార్టీ సిద్ధాంతాల రూపకల్పనకూ, తెలంగాణాపై తమ వాదనను వినిపించడానికి ఉన్న సందిగ్ధత తొలగిపోయినట్టే. ప్రజాభిప్రాయమేమిటీ అన్నది తేలిపోతుంది కాబట్టి దానికి అనుకూలంగా ఆ పార్టీలు తమ వైఖరేమిటో స్పష్టం చేయవచ్చు. చిరంజీవి రాజకీయాలలోకి వస్తే తమ వ్యూహమేమిటీ అన్నది దాదాపు అన్ని పార్టీలూ రచించుకున్నాయి. తెలుగుదేశం విషయానికి వస్తే బాలకృష్ణను ప్రముఖంగా రంగంలోకి తీసుకురావాలన్నది ఒక వ్యూహం. ఇదే జరిగితే తెలుగు సినీ పరిశ్రమలో రాజకీయ వేడి త్వరలో పూర్తిస్థాయిలో రగులుకోవడం ఖాయం. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆయన వియ్యమందుకోవడం, ఇటీవల చంద్రబాబు జూనియర్ ఎన్‌టిఆర్, బాలకృష్ణ తదితరులతో సమావేశమయ్యారన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ వార్త అభిమానులకు ఆశ్చర్యం కలిగించకపోవచ్చు కానీ, నిశ్చయంగా ఆనందాన్నందిస్తుంది. వచ్చే నెలలో బాలకృష్ణ పర్యటన వివరాలిలా ఉన్నాయి. జూన్ 10వ తన జన్మదినోత్సవాన్ని లాస్ ఏంజెల్స్‌లో ప్రవాసాంధ్రుల మధ్య జరుపుకుని, జూన్ 28వ తేదీకి విజయవాడ చేరుకుంటారు. అదే సమయానికి "మీకోసం" కార్యక్రమంలో రాష్ట్రపర్యటనలోఉన్న నారా చంద్రబాబు నాయుడు కూడా ఆ కార్యక్రమాన్ని ముగించుకుని విజయవాడ చేరుకుంటారు. వీరితో పాటు యన్.టి.ఆర్., నందమూరి కళ్యాణ్‌రామ్, నందమూరి తారకరత్నలు కూడా విజయవాడకు ఆరోజుకు వస్తారు. వీరందరూ విజయవాడలో ఆరోజు ఏంచేయబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది ఇటీవల బాలయ్య తూర్పుగోదావరి జిల్లాలోని అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని, పుల్లేటికుర్రులోని శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కోనసీమకు చెందిన కారుపర్తి మల్లేశ్వరరావు అనే సిద్ధాంతి సలహా మీదే బాలకృష్ణ ఇటీవల ఈ స్వామివారిని సందర్శించినట్టు భావిస్తున్నారు. మల్లేశ్వరరావు చెబుతున్న జోస్యం ప్రకారం బాలకృష్ణకు త్వరలో మహారాజయోగం పట్టనున్నది. జూన్ 10వ తేదీ (జన్మదినోత్సవం) నాటి నుంచి ఈ యోగం ప్రారంభమవుతుందని ఆయన చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 8నాటికి ఆయన అత్యున్నత స్థానానికి చేరుకుంటారని వివరిస్తున్నారు. మరి చంద్రబాబునాయుడు పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న వేస్తే, ఇద్దరూ బావ-బావమరుదులే కాదు, వియ్యంకులు కూడా వీరి సఖ్యతగా ప్రజల కోసం కలసి పని చేస్తారు అని అంటున్నారు. మహారాజయోగం ప్రారంభమైన తర్వాత ఏ క్షణాన అయినా బాలకృష్ణ రాజకీయ రంగప్రవేశం తాలూకు ప్రకటన వెలువడవచ్చునని ఆయన చెబుతున్నారు. గ్రహస్థితి బాలకృష్ణకు చాలా అనుకూలంగా ఉన్నందున జనాకర్షణ కీర్తిప్రతిష్టలు వంటివి పెరుగుతాయని మల్లేశ్వరరావు చెబుతున్నారు. బహుశా పార్టీ అధ్యక్ష పదవి వంటిదేమైనా దక్కేందుకు అవకాశం ఉన్నదన్నది ఈయన భావం కావచ్చు. మహానాడు వాయిదా పడడం, అమెరికా నుంచి తిరిగి రాగానే జూన్‌లో విజయవాడలో చంద్రబాబు తదితరులను బాలయ్య కలుసుకోవడం కూడా ఇటువంటి సూచనలనే అందిస్తోంది. బాలకృష్ణ ఇటీవల కోనసీమలో పర్యటించిన సందర్భంగా బాలయ్య తన అభిమానులతో, అక్కడి తెలుగుదేశం నాయకులతో రాజకీయాల గురించి బాగా లోతుగా చర్చించారు. జూన్ నాటికి ఉపఎన్నికలు పూర్తవుతాయి. తెలంగాణా సెంటిమెంట్ ప్రజలలో ఏమేరకు ఉందనేదీ కూడా తేలిపోతుంది. మరోపక్క చిరంజీవి పార్టీ పెట్టే పరిస్థితిపై జూన్ నెలాఖరునాటికి చాలావరకూ స్పష్టత రావచ్చు. ఆ పరిస్థితులలో తెలుగుదేశం పార్టీ పరంగా ఒక వేవ్ సృష్టించడం అనేది ప్రజలు ఊహించని ప్రకటనలతోనే సాధ్యమవుతుందనే వ్యూహంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నారనే సంకేతాలూ వస్తున్నాయి. తెలుగుదేశం పార్టీలో నందమూరి వంశానికి ప్రాధాన్యం పెరిగితే కలిగే లాభాలే ఎక్కువనే విషయాన్ని పార్టీ అభిమానులలో చాలామంది అంగీకరిస్తున్న నేపథ్యంలో బాలకృష్ణకు సముచిత పదవి ఇవ్వవలసి వస్తే మాత్రం అది పార్టీ అధ్యక్ష పదవే అవుతుంది. చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ జూన్ నెలనే తమ రాజకీయ రంగప్రవేశానికి ముహూర్తంగా ఎంచుకుంటే రాజకీయ రంగంతో పాటు సినీ పరిశ్రమపై కూడా దాని ప్రభావం ఎంతో కొంత పడకమానదు. ఇక అప్పటి నుంచి రెండు రంగాలలోనూ సంచలన వార్తలెన్నో పుట్టుకురావచ్చు.

